# మణి

శ్రీమతి పెద్దిసెట్టి రామంగారు

రామచంద్రరావుగారి ఇంటిలో బహు సంతోష దాయకముగా యున్నది. రామచంద్రరావుగారి ధర్మ పత్నియగు సుందరమ్మ పనిమనుష్యులను ఇదిచేయి, అదిచేయి అని హెచ్చరించుచుండెను. రామచంద్ర రావుగారిఇల్లు యింత సంతోషముగా యుండుటకు వారి ఏకపుత్రుడగు మాధవుడు చెన్నపట్టణమునుండి బి. యల్. పరీక్ష ప్యాసుఅయి వచ్చుటయే ఆదంపతు లను ఆనందసాగరమున మునుచుచున్నది. రామచం ద్రరావుగారు స్వయంగా కారుపైవెళ్ళి కొడుకును తోడ్కొనివచ్చెను. కుమారుడు వచ్చుటయేతడవుగా తల్లి కుమారుని కౌగిలించుకొని ఆనందబాష్పములను విడిచెను. కుశలప్రశ్నలైనతరువాత ఫలహార మారగించి మేడపైకివెళ్ళి యీజీచైరులోపడుకొని తన చిన్న నాటిసంగతులను జ్ఞప్తికి తెచ్చుకొనుచున్నాడు: ఆహా! యీప్రదేశమువీడి రెండువత్సరము లైనదికదా యని అనుకొనుచున్నాడు. మాధవుడు చక్కనివాడు; 24 సంవత్సరముల యువకుడు; సదయహృదయుడు. ఆయన హృదయము కొల్లప్పుడును కాంతిరులతో నిండియుండును. అటుతట్లు పండుకొని ఆహో! సోమరి వలె పట్టినే పండుకొనకూడదు యని పవిత్రఆంధ్ర మాస పత్రికయగు గృహలక్ష్మిని తీసి చదువుచున్నాడు.

ఇంతలో మాధవా! యని పిలుచుచు తల్లి మేడ పైకివచ్చి యేమిచేయుచుంటివి నాయనా అనిఅడిగను. ఏమియు చేయుటలేదమ్మా యీగృహలక్ష్మి చదువు చుంటినని బదులు పలికెను. ఇంతలో 15 వత్సరముల కన్యక ఆమేడపైకి వచ్చెను. సౌందర్యవంతురాలు కాదు. మెడలో ఒక గొలుసును, చేతికి రెండు జతలుగాజులను, చెవులకు లోలక్కులును, చేతికి ఒక వుంగరమునుతప్ప వేరేమియు నగలులేవు. మాధవుని చూచి ఆమె సిగ్గుచే తిరిగివెళ్ళిపోవలెనని ప్రయత్నించి నదిగాని, సుందరమ్మయొక్క బలవంతముచే వచ్చి ఆమెప్రక్కన కూర్చున్నది. ఎవరమ్మాయి యీ అమ్మాయి అని మాధవుడు ప్రశ్నించినాడు. యీ అమ్మాయిని మరిచిపోయినావా నాయనా? ఆనంద రావుగారికుమార్తె మణిని జ్ఞాపకములేదా నాయనా అని ఆమె అడిగినది. ఆవెంటనే మాధవుడు అమ్మా నేనుచూచి రెండుసంవత్సరములైనదికదమ్మా అప్పు టికి చిన్నపిల్ల ఇప్పుడు కొంచెము పెద్దదైనది కదమ్మా అందుచే గుర్తించలేకపోతిని. మణీ యిలాగురా అని పిలిచినాడు. మణి వెళ్ళుటకు సిగ్గుపడినది. వెళ్ళమ్మా! మాధవునిదగ్గర నీకేమిసిగ్గు వెళ్ళుమనెను. మణి వెళ్ళి మాధవునికి కొంచెముదూరముగా నిలువబడినది. మణీ నేను ఒకవేళ మరిచిపోతే నీవుపలకరించకూడదా? ఏమి! ఇంత సిగ్గెందుకు. అని మణీ యేమి చదువు కున్నావు? ఫస్టుఫారం చదివితిని, ఏమి ఇంక చదువుట లేదా? నాన్నగారు వెళ్ళనిచ్చుటలేదండీ అందుచే వెళ్ళలేదు. అని అనెను. అమ్మా ఎందుచేతమ్మా మణిని బడికి పంపుటలేదు. అని అడిగెను. బాబూ! మనలో అట్లు వెళ్ళకూడదు నాయనా! బడికివెళ్ళితే తప్పేమి అమ్మా చెన్నపట్టణంలో చూడవలెను. ఎక్కడ చూచినా ఆడవాళ్లు బిరుద్యాలు ఎవరేయేలె కదా? మన హిందూమతంలో మరీ అన్యాయముగాయున్నది. నాయనా మణిని పెండ్లిచేసుకుంటావా బాబూ నాకు వచ్చినది అని అడిగె కుమారుడు ఏమని జవాబు చెప్పునో యని కుమారునిమొగముపై చూపులు నిగి డ్చెను. మణి పెండ్లిప్రస్తావన వచ్చుటయే అక్కడ నుండి వెళ్లుటకు ప్రయత్నించెను. గాని మాధవుడు వెళ్లవద్దు మణి ఎందుకుసిగ్గు వెళ్లకు అనిచెప్పి బలవంత

మున వెళ్లకుండా చేసెను. నాయనా! నాకోరిక నెరవేర్చెదవా బాబూ అని అడిగెను. అమ్మా నీమాటకు ఎదురు ఆడుదునా! అట్లనే చేసుకొందును. అని పలికెనో లేదో సుందరమ్మ మనస్సు సంతోషముతో యుప్పొంగెను. సుందరమ్మకు పనివుండుటచే క్రిందకు దిగి వెళ్ళిపోయెను. సుందరమ్మ మేడదిగుటతోడనే మణి వెళ్ళిపోవుటకు లేచెను. గాని మాధవుడు మణీ వెళ్లకుమణీ; వుండు అని చెప్పి స్వయంగా గదిలోనికి వెళ్లి ఒక కుర్చీ తెచ్చి సైటువరండాపైవేసి తానొక యీజీ చైరుపై పండుకొని మణీ నిన్ను ఒకమాట అడిగెదను, చెప్పెదవా? చెప్పెదనన్నట్లు తలయూచినది మణి. నన్ను పెండ్లిచేసుకొనుట ఇష్టమేనా? అని అడిగెను. ఇష్టమైనను కొనసాగుట బహుదుర్లభమను ఆశానూచకముగు పలుకులుబల్కెను. ఏమి! మణీ ఎట్లు దుర్లభము. ఎట్లు దుర్లభమని అడుగుచున్నారా? మీరు పెద్దజమీందారుని ఏకపుత్రులై జన్మించినారు. బి. యల్. ప్యాసు అయినారు. నేను ఒకానొక చిన్న ఆఫీసర్ కూతురును. మేము ఇద్దరము అక్కచెల్లెండ్రము, ఇద్దరు అన్నదమ్ములు. మాది కొంచెము పెద్దకుటుంబము. వచ్చే ఆదాయముచూస్తె నెలఒక్కంటికి 95 రూప్యములు. నాన్నగారి ఒక్కరిచేతిమీద వచ్చేదల్లు తొమ్మండుగురు తినుట; అన్నయ్య చెన్నపట్టణములో యం.బి.బి.యస్. చదువుచున్నాడు. నిన్నటిదినము 100 రూపాయలు అర్జంటుగా పంపమని వుత్తరము వచ్చినది. నాన్నగారు కంగారుపడుచుండగా నామెడలోని మీదిచైనుతీసి అమ్మివేసి ఆవచ్చేడిసొమ్ము అన్నకు పంపమని చెప్పి ఇలాగు వచ్చితిని. మీనాన్నగారు కనీసం నాలుగువేలుఅయినా కట్నం పుచ్చుకొననిదే మీకు పెండ్లిచేయరు. మానాన్నగారుచూస్తే ఏదో వెయ్యిరూపాయలకు మించి ఇవ్వలేరు. మాఇల్లు మా తల్లిగారిచంటిమీదనున్న నగలు అమ్మిన నాలుగువేలు వచ్చునను కొందము. ఆనాలుగువేలు మీకు కట్నం ఇచ్చెదరు. తక్కిన పెండ్లిఖర్చు ఎక్కడనుండి తెచ్చెదరు? ఇంకనూ నాతరువాత చెల్లెండ్రకు ఎట్లు వివాహము చేయుదురు? నాతమ్ముళ్లకు ఎట్లు విద్యచెప్పించెదరు? నావివాహముచేసి వారు చిప్పలు పట్టుకొనవలెనే గాని అంతకుమించి వేరేమియు లేదుకదా? అందుకని మీకు నాకు వివాహమగుట అసంభవమని తెల్పితిని. మణీ ఇంత చిన్నతనములో కష్టసుఖములగురించి బాగుగా ఆలోచించినావు. మన ఆంధ్రులలోవున్న తెలివితక్కువే ఇది. కట్నం ఎందులకుమణీ! ఆడబిడ్డ ఇచ్చేడివారు ఎంత కష్టపడి ఎంత దుఃఖపడి ఇచ్చెదరో!! ఆసొమ్ము ఎన్నాళ్లు వుండును కనుక వారిని అంత కష్టపెట్టుట మణీ! చెన్నపట్టణములో వరకట్నము పేర సభజరిగినది. ఆసభకు నన్ను యుపన్యాస మివ్వమని కోరియుండిరి. ఆసందర్భములో ఇచ్చిన యుపన్యాసమునకు గాను, యీ సువర్ణపతకమును ఇచ్చినారు. అని చెప్పి ఆసువర్ణపతకమును చూపెను. ఆమెయు బహు సంతోషముతో దానినిచూచి మీకీర్తి ఆచంద్రార్కము వ్యాపించుగాక. అని మృదుమధురవాక్యముపల్కి తిరిగి ఇచ్చివేసెను. అయితే మీరు ఇప్పుడు కట్నంపుచ్చుకొనెదరా? లేక మానివేయుదురా? అని అడిగెను మణి. మణి! నేను కట్నంపుచ్చుకొనిన నలుగురిలో ఎంత నగుబాటు. బి యల్ చదివినాడు, యుపన్యాసము లిచ్చినాడు తానే ఆఖరకు కట్నం పుచ్చుకొన్నాడు. మరి యితరులు చదువుకొనని కుంకలు సభలన్న ఎరుగనివారుగూడ తీసుకొన్నారంటే తప్పేమి. అని అడిగెదరా? లేదా? మణి. కాన నాకు కట్నమందు ఆశలేదు కాన నిన్నే తప్పక పెండ్లి చేసుకొందును. మణి టైము అయినట్లుగా యున్నది. అలాగున సైరు వెళ్లవలయును. అనిచెప్పి లేచెను. నాకుకూడ వంట వేళ అయినది వెళ్లెదనండి అనిచెప్పి కుర్చీపైనుండి లేచెను. ఏమి! మణి నీవు వంటచేయుదువా? మీరు జమీందారులు కాన ఎట్లయిన వంటమనిషిని పెట్టుకొందురు. మేము ఎట్లు పెట్టుకొనగలమండీ అని నవ్వుచూ పల్కినది. పోనిలే మణి నేను పెండ్లి చేసుకొన్నతరువాత వంటమనిషినిపెట్టి నిన్ను ఇట్లనే కుర్చీపై కూర్చొనబెట్టి చక్కనిముద్దులు గైకొందును. తెమ్ము అనెను. ఎట్లు! నాకు చూపెదరా అనెను. అమ్మ! మణి! మా చమత్కారిణివలె నుంటివేయని చెప్పి కుర్చీపై కూర్చొనబెట్టి చక్కనిముద్దు పెట్టుకొని ఇలాగునని తెలియజేసెను. ఇద్దరు నవ్వుకుంటూ మేడ దిగిపోయిరి. మాధవుడు టీచిపైపు వెళ్లిపోయెను. మణి రామచంద్రరావుగారి ఇంటికి కొంచెము దూరములోని చిన్న ఇంటివద్దకు వెళ్లి తలుపుకొట్టెను. ఇందుమతి అను బాలికవచ్చి మణీఅక్కా వచ్చావాఅని తలుపుతీసెను. ఇద్దరు లోనికివెళ్లి తలుపు గడబెట్టిరి.

# మణి

శ్రీమతి పెద్దిశెట్టి రామంగారు

(అనుబంధకథ)

[రామచంద్రరావుగారి కుమారుడు, మాధవుడు, చెన్నపట్టణమునుండి బి. ఏ పరీక్షప్యాసయి యింటికివచ్చును. రామచంద్రరావుగారు అనురాగపూర్వకమైన స్వాగతమొసంగును. తల్లి సుందరం మాధవరావుకు పొరుగింటి ఆనందరావుగారి కూతురు మణిని చూపును. మాధవు డామె తనను పెండ్లిచేసుకొనునేమో అని, రహస్యముగ అడుగును. మాధరావు శ్రీమంతుడనియు, తనతండ్రి పేదవాడనియు నాలుగువేలైనను పెండ్లికట్న మీయలేడనియు కనుక పెండ్లి జరుగదనియు ఆమెచెప్పును. తాను మున్నొకసారి వరశుల్క విరుద్ధముగ ఉపన్యసించెను గనుక తనకు వరశుల్క మక్కరలేదని చెప్పి ఆమెను ముద్దాడి తాను బీచిపికారుపోయెను.]

మాధవుడు బీచికివెళ్లి ఒక యిసుకతిన్నెపై కూర్చొని ఆ సముద్రతరంగములఘోష వినుచుండెను. ఇంతలో 16 సంవత్సరముల జవ్వని అక్కడికి వచ్చి మాధవునికి కొంచెముదూరములో కూర్చొనెను. ఆ వుంగరములుతిరిగినజుట్టు, ఆ ప్యారిస్‌కట్టుచీర, ఆ లోలక్కులు, చీరమీద అందరికి కన్పించేటట్లు సర్దిన నెక్‌లేసు ఆమెకు క్రొత్తఅందమును తెచ్చుచుండెను. ఆ యువతి క్రీగంట మాధవునివీక్షించి ఆతని సౌందర్యమునకు అబ్బురంబొందుచుండెను. ఆమెను చూచిన లగాయితు మాధవునిమనసు చాంచల్యము నొందెను. ఎవరీమె యని ఆలోచనలో పడినాడు. ఆహా! యీమె సౌందర్యము వర్ణనాతీతము కదా! ఆమె అందమునకు తనలోతానే బహుసంతోషించినాడు. ఆమె అట్లు ఒకఅర్ధగంట చల్లగాలి సేవించి వెళ్లిపోవుచున్నది. ఇంతలో మాధవుడు ఆమె కూర్చొన్న స్థలమువద్ద పర్సువిడిచి వెళ్లిపోవుటచూచినాడు. తీసి ఆమెవద్దకు చరచరనడిచి యీపర్సు అక్కడ విడిచిపేస్తివి, తీసుకొనుమని ఇచ్చెను. థాంక్స్ అని ఇంగ్లీషుపదమును వాక్రుచ్చెను. మీరు సాగుకించి శ్రమపడితిరి, మీ పేరేమి అని అడిగెను. నాపేరు మాధవరావు అని బదులిడి నీపేరేమి, నా పేరు తెలుసుకొంటివికదా, మరి నీపేరు నేను తెలుసుకొనవద్దా యని చిఱునవ్వునవ్వుచు పలికినాడు. నాపేరు లీలాకుమారి అని పేరుచెప్పి, మీ రేమి చదువుకొన్నారు అని అడిగినది లీల. నేను మొన్ననే బి. యల్ పరీక్ష ప్యాసుఅయి యీదినము మెయిలులో వచ్చితిని. నీవు యేమిచదువుచున్నావు అని మాధవుడు ప్రశ్నించుటయే తడవుగా స్కూల్ ఫైనల్ ప్యాసుఅయితిని. యఫ్. యే చదివెదనని చెప్పినది. మీ తండ్రిగారి పేరేమి, ఆయన ఏమిపని చేయుచున్నారని మాధవుడు అడిగినాడు. మా తండ్రిగారిపేరు ప్రసాద్ రావు. ఆయన సబుజడ్జిగా యీవూరిలో పనిచేయుచున్నారు. వోహో! నీవు ప్రసాద్ రావు గారి ఏకపుత్రికవా? మీ అన్న రాజశేఖరరావు నాతోనే బి. యల్ చదివినాడు. ఆయన పరీక్షపోయినది. నీవు రాజశేఖరం చెల్లెలవాయని అడిగి, మాయింటికి వచ్చెదవా లీలా అని అడిగినాడు. నేను ఇప్పుడు రాను, నాకు పని యున్నదండీ, క్షమించండి అని పలికి సెలవు అని

అక్కడను సమీపములో రోడ్డుపై, నున్న కారులో ఎక్కి ఆమె వెడలిపోయినది. మాధవుడు లీలను చూచినదగ్గరనుండి ఆమె సౌందర్యమునకు ఆమె ఫ్యాషన్‌కు ఆమె చదువుకు చాలసంతోషించి అటు వంటి యువతిని పెండ్లిచేసుకొన్నవానిదే జన్మము అని ఆలోచించుకొనుచు ఇంటికి తిరిగివచ్చినాడు. మాధవుని మనస్సు లీల తీసుకొనిజనినది. మాధవుడు, కాఫీ త్రాగుచున్నప్పుడు లీలమూర్తి, చదువుచున్నప్పుడు లీలయే, భోజనముచేయుచుండ లీలయే, ఎల్ల వేళలందు లీలమూర్తియే కాన్పించుచున్నది. మణి (తాను వివాహముచేసుకొందునని మాటయిచ్చిన కన్య) యొక్క ప్రతిబింబమును హృదయమునుండి తీసి పారివేసినాడు. లీలను చూచినదగ్గరనుండి పిచ్చివాని చందముగా అయిపోయినాడు.

ఒక దినమున రామచంద్రరావుగారు, ఆయన భార్యయు, మాధవుడును కలిసి మేడమీద వసారాపై కూర్చొనియుండిరి. అందరు మౌనముగాయుండిరి. మాధవా నీకు తగినంతవిద్య చెప్పించితిని. నా చేతులతో నీకు వివాహమొనర్పవలెనని యున్నది. నీ ఇష్టము తెల్పెదవా? అని అడిగినారు తండ్రి రామచంద్రరావుగారు. ఇంత వేగిరం ఎందుకండి నాకు పెండ్లి? అని సంకోచిస్తూ బదులిడినాడు. ఏమి! ఇంకనూ పెండ్లివద్దా? మా తాతకు 11 సంవత్సరములకు పెండ్లిఅయినది. ఇప్పటికాలపువారు కాన ఇంత ముదిరిపోయినవరకు పెండ్లిలేక వుంటూయున్నారు. పెండ్లికొడుకుముదిరినా బెండకాయముదిరినా పనికి రారంట. ఈ సంవత్సరము తప్పక నీకు పెండ్లిచేయుదును అని మహారౌద్రముతో పల్కినాడు. సుందరమ్మ ఏమండీ! మనమాధవునికి ఆనందరావుగారి కూతురు మణిని చేయుదుమా అని పలికెనో లేదో వోసి వెధవ ముండ, ఆ దరిద్రగొట్టు సంబంధంచే దొరికినది! నీకు నేను ఎంతమాత్రం చేయను ఆసంబంధము. ఆ ఆనంద రావుగారు తలఎక్కడ నా తలఎక్కడ. వాడు నాలుగువేలుకట్నం ఇవ్వగలడా? ఎంతమాత్రం ఆసంబంధము పనికిరాదు. అని పలికి నేను వెంటనే సంబంధము కుదిర్చెదను. తల్లి కొడుకులకు మంచిప్రాయశ్చిత్త మగునని మహాకోపముతో వెళ్లిపోయినాడు. తల్లి కంటనీరుపెట్టుకొని నాయనా చిన్నతనమునుండి మణిని చేయుదమని యుండెడిది. సుగుణరాశియగు మణి నా కోడలై నేను సేవలు చేయించుకొనుటకు నోచనైతిని అని విచారముతో కూర్చుండెను. మాధవునికి ఇవిఅన్నియు తలకెక్కుటలేదు. లీలను చేసుకుంటే బాగుండును. నాతండ్రి యేమి సంబంధముచేయునో అయినా నేను వరశుల్కము లేని యుపన్యాసములిచ్చియుంటిని. ఎవరైనావిన్న ఎంతనగుబాటు, అయ్యో! నేను ఎంత దురదృష్టవంతుడను. లీలనా బడయజాలక పోవుచున్నాను. వరశుల్కమా పుచ్చుకొనుచున్నాను. అని కంటనీరు పెట్టుకొనెను. తల్లి అయ్యో! పాపం మణిని చేసుకుందామని ఎంత ఆశయున్నదో పిల్లడికని ఆమె యనుకొని, నాయనా! విచారించకు. ఎవరి వ్రాతలెట్లున్న అట్లుజరుగును. విచారించకు నాయనా! నీతండ్రి చాలకోపిష్ఠి, పట్టుదలగలమనిషి, అన్నంతపని చేసితీరును నాయనా విడవకుమని వోదార్చి ఆమె మేడదిగి వెళ్లిపోయెను.

మాధవుడు అట్లు విచారించి సబుజడ్జీ ప్రసాద్ రావుగారి ఇంటికివెళ్లెను. లీల మాధవుని సగౌరవముగా దోడ్కొని హాలులోనికి తీసుకొనివెళ్లినది. ఇరువురును చెరి యొకకుర్చీమీద కూర్చొనిరి. ఆమాట యీమాట ఆడినతరువాత మీకు వివాహమైనదా యని అడిగినది. లేదు ఇంకనూ, యీసంవత్సరము అగును అని అనెను. ఎవరి కుమార్తెయని యడుగ మా నాన్నగారికే గాని నాకు తెలియదు. అయ్యో! మీకే తెలియదా మీరా పెండ్లిచేసుకొనుట? లేక మీ తండ్రిగారా? బాగున్నదని పకపకానవ్వినది. ఆనవ్వు మాధవుని మనస్సు కలిచివైచినది. లీలా నీవు ఎప్పుడూ ఇక్కడనే చదివెదవా? ఇక్కడనే చదివెదను. లీలా ఇంక సెలవు ఇమ్ము, మరల రేపు కలుసుకొందును, అని ఇంటి మొగముపట్టెను.



660

ఓసేవ్! ఓసేవ్! అని కేకవేసి రామచంద్రరావు గారు సుందరమ్మను అతివేగముగా రమ్మని పిలుచుచుండిరి. ఆమె ఎందుకండీ అనుకుంటూ వచ్చినది. ప్లీడర్ జనార్దనరావుగారికి ఇద్దరుకూతుళ్లు. ఇద్దరు కుమారులు. పెద్దపిల్ల 6 వ క్లాసు చదువుకొన్నది. అంత రూపసికాదు. 16 సంవత్సరము లుంటాయి. వసుంధరాదేవి పిల్లపేరు. కట్నం నాలుగువేలు. బాలతొడుగు వెయ్యిరూపాయలు. పిల్లడికి వెండి చెంబు, వెండిపళ్లెం, పట్టుపంచెలచాపు, తక్కిన లాంచనములన్నియు బాగానే జరిపెదరు. మంచి సంప్రదాయమైన కుటుంబము. మంచి పలుకుబడి. నాకు నచ్చినది. పెండ్లి మాఘమాసములో నిశ్చయముచేసెదను. అని అన్నియు ఏకరవుపెట్టెను. సుందరమ్మ అన్నియు విని బెల్లంగొట్టిన దిమ్మవలె యూరకున్నది.

ఆనందరావుగారి కుటుంబవిషయం: ఆయన భార్య పేరు జ్ఞానాంబ, ఆమె చాల తెలివితేటలుగలమనిషి. గృహవిషయములలో మంచినేర్పరి. ఆమె జ్యేష్ఠ పుత్రుడు చెన్నపట్టణములో యం బి బి యస్ చదువుచున్నాడు. వారి జ్యేష్టపుత్రికయే, సుగుణయగు మణీదేవి. రెండవపుత్రిక ఇందుమతి. వారి కుటుంబమంతయు మంచి సరళహృదయములు గలవారు. మంచి దయార్ద్రహృదయులు. ఆనందరావుకు మణిని మాధవునికి ఇవ్వవలయునని యుండెడిదిగాని వారితో సంబంధముచేయుట చాలకష్టతరమని ఆ ఆశవీడి మణి మేనమామయగు కమలాకరునికిచ్చి వివాహమొనర్ప వలెనని అనుకొనియున్నది. కమలాకరునికి చిన్ననాటనుండి మణినే చేసుకొనవలెనని యుండెడిది. గాని మణికి మాత్రం కమలాకరునిపైన ప్రేమలేదు. ఆమె మాధవుని ప్రేమించియున్నది. ఆమె ప్రేమనిశ్చలము. అది స్వచ్ఛమైనది. ఒకదినమున జ్ఞానాంబయు, మణియు, వసారాలోకూర్చొనియుండ ఆనందరావుగారువచ్చిరి. జ్ఞానాంబా! రామచంద్రరావుగారి కుమారుడు మాధవునికి పెండ్లి వచ్చేనెలలో, అనెను. ఎవరిపిల్లండి? అని అధికాతురతతో ప్రశ్నించినది జ్ఞానాంబ. ప్లీడర్ జనార్దనరావుగారి కూతురు వసుంధరాదేవిని ఇచ్చుచుండిరి. మనకెందులకు వారి ప్రస్తావన? వారు గొప్పవారు. గొప్పవారి సంగతులు, మనకెందులకని మిన్నకుండిరి. మణికిమాత్రం మనస్సు మనస్సులోలేదు. ఏమి నన్ను చేసుకుంటానన్నారే. అలాంటిది వసుంధర నెట్లు చేసుకొనుచున్నారు. ఆయనకు నచ్చినది కాబోలు అని పరిపరివిధములుగా ఆలోచించుకొనుచున్నది.

జనార్దనరావు భార్యపేరు రుక్మిణమ్మ. వారికి ఇద్దరు కుమారులు. ఇద్దరు కుమార్తెలు. ఇద్దరు కుమార్తెలలోను పెద్దకుమార్తనే రామచంద్రరావుగారి కుమారునకు నిశ్చయమైనది. రెండవకుమార్తె శ్రీలతాదేవి. ఫోర్తు ఫారం చదువుచున్నది. ఆతక్కిన మొగపిల్లలు చిన్నవాళ్లు. జనార్దనరావుగారి ప్రాక్టీస్ మొట్టమొదటిలో బాగుండెడిది. గాని ఇప్పుడు ఎక్కడచూచినా లాయర్లే అవుటచే ఆయన ప్రాక్టీస్ అంతగాలేదు. ఆయన పాపం ఇప్పుడు మహాచిక్కులోపడినాడు. మాధవునికి నిశ్చయమైనదిగాని డబ్బుగురించి బహు తంటాలు పడుచున్నాడు. తోట భూమికలిపి మూడు వేల రూపాయలకు అమ్మివేసెను. భార్యవంటిపై నగలు వెయ్యిరూపాయలకు అమ్మినాడు. కట్నం సంపాదించినాడు. బాలతొడుగు యేమిపెడతాడు? తక్కిన లాంచనములు ఎట్లు జరుపుతాడు? అందుకు ఇంటిని రెండువేలరూపాయలకు తనఖాపెట్టినాడు. వెయ్యి రూపాయలుపెట్టి వసుంధరాదేవికి నగలు చేయించినాడు. తక్కినసొమ్ముతో పెండ్లిచేయ నిశ్చయించుకొన్నాడు. అటువంటి జమీందారునితో సంబంధము చేయుచుంటినే అని గర్వపడుచున్నాడుగాని ముందు ఎట్లుగడుపుటయో కూడ ఆలోచించినాడు కాడు. మణి తనచెల్లెలగు ఇందుమతికి జడవేయుచున్న సమయములో అమ్మా! మణీ! అని ఆనందరావుగారి పిలుపు వినబడినది. వస్తూయున్నానండీ అనుకుంటూ తండ్రి వద్దకు వచ్చినది. ఇదుగో అమ్మా మాధవుని పెండ్లి పత్రిక. అని ఇచ్చివేసి ఆయన వెడలిపోయినాడు.

శ్రీరస్తు శుభమస్తు

వివాహమహోత్సవాహ్వానపత్రిక.

శ్లో॥ జానక్యాః కమలామలాంజలిపుటేయాః పద్మ
రాగాయితాః। న్యస్తా రాఘవమస్తకేచవిల
సత్కుంద ప్రసూనాయితాః। స్రస్తాశ్యామల
కాయకాంతికలితాః। యాయింద్రనీలాయితాః
ముక్తాస్తాశ్శుభదాభవంతు భవతాం శ్రీరామ
వైవాహికాః॥

అయ్యా !

శుక్రవారం నవమి 7-48 నిముషములకు అనగా, 12–6–1931 తారీఖున.

నా కుమార్తె చిరంజీవి సౌభాగ్యవతియగు

వసుంధరా దేవిని

రామచంద్రరావుగారి ఏకపుత్రుడగు

మాధవరావునకు

ఇచ్చి కాకినాడలో నా స్వగృహమందు వివాహము జరుపుటకు పెద్దలచే స్థిరపరుపబడినది గాన తత్సుభ ముహూర్తంబునకు కుటుంబబంధు మిత్ర సహితము దయచేసి వధూవరులను ఆశీర్వదించి నన్ను ఆనందింపచేయ కోరుచున్నాడను.

ఇట్లు విధేయుడు,

సరస్వతీ పవర్ ప్రెస్ రాజమండ్రి — జనార్దనరావు.

# నీ న డ వ డి

రావు వెంకటరంగనాయకులుగారు

సనాతనుడ నంటావు — సత్కర్ముడ నంటావు
మాల లింటికివస్తె — మరి మొగిరిపడతావు
సత్కులీనుడ నంటావు — స్వప్రయోజకుడ నంటావు
బీద లింటికివస్తె — బెదరించి వేస్తావు
సంధ్యావందన మంటావు — సత్యాచార మంటావు
మడి గట్టకుండానె — మరి భోంచేస్తావు
గీతా పారాయణంటావు — గీత బోధిస్తావు
అధిక వడ్డీలిచ్చి — అప్పుపాల్జేస్తావు
దేశసేవంటావు — దైవభక్తంటావు
దేశసేవకులను — దెప్పిపొడుస్తుంటావు
సనాతనుడ నంటావు — సత్కర్ముడ నంటావు
మాల లింటికివస్తె — మరి మొగిరిపడతావు.